# మిర్చి కొనుగోళ్లకు చురుగ్గా సన్నాహాలు

**గ్రామీణ సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో మిర్చి కొనుగోళ్ల కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి. శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు చొరవతో ఇప్పటికే యార్డు అధికారులు, ఏజెన్సీ ప్రతినిధుల చర్చలు సఫలమయ్యాయి. ఈ మేరకు జననీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ వెంకట కరుణాకర్, యార్డు ఛైర్మన్ ఆళ్ల సాంబయ్య, ఇన్‌ఛార్జి కార్యదర్శి షఫీవుద్దీన్ మంగళవారం సమావేశమయ్యారు. మార్కెటింగ్ శాఖ కమిషనర్ సూచనల మేరకు కొనుగోలు కేంద్రం నిర్వహణలో ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు అవసరమైన వసతి, విద్యుత్తు సౌకర్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఇప్పటికే పాలకవర్గం చేసిన తీర్మానం మేరకు రెండు గోదాములను జననీ ఫుడ్స్ సంస్థకు అద్దె ప్రాతిపదికన కేటాయించారు. కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన వివిధ అంగీకార, అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ మేరకు జననీ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ వచ్చే నెల రెండో వారంలో కేంద్రం ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు చెప్పారు. కేంద్రంలో మిర్చి నాణ్యత పరీక్ష యంత్రాన్ని డిజిటల్ ఇండియాలో భాగంగా తెప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలుదారులందరూ ఇండస్ బ్యాంకులో ధరావత్తు చెల్లించి కొనుగోలు అనుమతులు పొందుతారని చెప్పారు. ప్రతి రోజు 3-4 గంటల మధ్య ఆన్‌లైన్ వ్యాపారం పూర్తి పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. రైతు సుముఖత మేరకే సంబంధిత ధరకు సరుకు విక్రయిస్తారన్నారు. వెంటనే రైతు ఖాతాకు నేరుగా రావాల్సిన నగదు మొత్తం జమ అవుతుందని స్పష్టం చేశారు. యార్డు ఛైర్మన్ మాట్లాడుతూ పూర్తి పారదర్శకంగా జరిగే మిర్చి కొనుగోళ్ల లావాదేవీలతో రైతుకు మేలు జరగడమే కాకుండా యార్డుకు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. సత్తెనపల్లితోపాటు పరిసర మండలాల మిర్చి రైతులకు సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. సమావేశంలో తెదేపా మండల అధ్యక్షుడు కోమటినేని శ్రీనివాసరావు, డీసీ ఛైర్మన్ తుమ్మల ఏడుకొండలు, పార్టీ కార్యదర్శి సోల నంబి, రైతు ప్రతినిధులు కూచి ఆంజనేయులు, వక్కంటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెలలో కేంద్రం ప్రారంభం